

వరంగల్ నిట్ 65వ వ్యవస్థాపక దినోత్సవంలో న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కోమల్‌కపూర్‌ను సన్మానిస్తున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

### అధ్యాపకులు, సిబ్బందికి సత్కారం

ఈ సందర్భంగా 25 ఏళ్లకు పైగా సేవలందించిన అధ్యాపకులు, సిబ్బందిని సత్కరించారు. వరంగల్ నిట్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వవిద్యార్థులను అనుసంధానం చేసేందుకు ఎన్ఐటీడబ్ల్యూఏఏ యాప్‌ను ప్రారంభించింది. లాంచ్ సందర్భంగా, పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు శ్యామ్ మాట్లాడుతూ ఇన్‌స్టిట్యూట్‌లోని సుమారు 40 వేల మంది పూర్వవిద్యార్థులను కనెక్ట్‌చేసే లక్ష్యంతో యాప్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. వరంగల్ నిట్‌లోని పూర్వవిద్యార్థులు, అధ్యాపకులందరికీ గ్రూప్ హెల్త్ ఇన్సూరెన్స్‌ను ప్రారంభించినట్లు చెప్పారు.

# 2070 నాటికి అణు ఇంధనం ముఖ్యపాత్ర

## న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కోమల్ కపూర్

- ఆర్ఈసీల శ్రేణిలో వరంగల్ నిట్ మొదటి స్థానం
- పరిశోధన, ఆవిష్కరణలకు ప్రోత్సాహమే లక్ష్యం
- స్టార్టప్‌లు, పరిశోధనా కేంద్రాల కోసం రీసెర్చ్ పార్క్
- వరంగల్ నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి
- ఘనంగా నిట్ 65వ వ్యవస్థాపక దినోత్సవం

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 10 : 'నేడు దేశంలో అణు ఇంధన సహకారం మూడు శాతం కంటే తక్కువ ఉంది.. ఇది 2050 నాటికి 18 శాతానికి పెరుగనుంది. 2070 నాటికి దేశ నికర జీరో కార్బన్ ఉద్గారాన్ని నెరవేర్చడంలో అణు ఇంధనం ముఖ్య పాత్ర పోషిస్తుంది' అని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్‌కపూర్ అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) 65వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. నిట్‌లోని అంబేద్కర్ లెర్నింగ్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చైర్మన్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ కోమల్ కపూర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ నిట్ 65వ వ్యవస్థాపక దినోత్సవంలో తాను భాగమైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్ చేపడుతున్న పనులు, దేశానికి ఉపయోగపడే అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డీ శ్రీనివాసాచార్య 1959లో ఇన్‌స్టిట్యూట్ ప్రారంభమైనప్పటి నుంచి ముఖ్యమైన మైలురాళ్ల గురించి వివరించారు. ఇన్‌స్టిట్యూట్‌లో వివిధ కార్యక్రమాల ప్రారంభం గురించి మాట్లాడుతూ ఈ సంస్థలో 13 డిపార్ట్‌మెంట్లు, ఎనిమిది అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లను (బీ టెక్) ఇంజినీరింగ్‌లో ఇంజనీరింగ్, సైన్సెస్, మేనేజ్‌మెంట్‌లో 35 పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లు (ఎంటెక్, ఎమ్మెస్సీ, ఎంసీఏ, ఎంబీఏ) ఉన్నాయని చెప్పారు. నిట్‌కు 2007 ఆగస్టులో 'జాతీయ ప్రాముఖ్యత ఇన్‌స్టిట్యూట్' హోదా దక్కిందన్నారు. నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ వరంగల్ నిట్ శంకుస్థాపన అక్టోబర్ 10, 1959న జరిగిందని, ఆర్ఈసీల శ్రేణిలో వరంగల్ నిట్ మొదటిస్థానంలో ఉందని, 2002 సెప్టెంబర్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వరంగల్‌గా పేరు మార్చారని తెలిపారు. సమాజంలోని ముఖ్యమైన సమస్యలను పరిష్కరించేందుకు పరిశోధన, ఆవిష్కరణలను ప్రోత్సహించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. స్టార్టప్‌లు, పరిశోధనా కేంద్రాలకు అనుకూలమైన వాతావరణాన్ని అందించేందుకు రీసెర్చ్ పార్కును ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతేడాది 983 పరిశోధన ప్రచురణలు వెలువడ్డాయని, విద్యార్థుల్లో 98 శాతం మంది గత విద్యాసంవత్సరంలో రూ.88 లక్షల మేరకు అత్యధిక ప్యాకేజీ పొందారని తెలిపారు. క్యాంపస్‌లో ప్రయాణానికి ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగిస్తారని, త్వరలో ఇన్‌స్టిట్యూట్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రక్రియను అమలు చేస్తామని తెలిపారు.

### విజేతల వివరాలు

**1. ఉత్తమ ఫ్యాకల్టీ అవార్డు (ఇంజినీరింగ్)**
ప్రొ. పీ రతీష్‌కుమార్ (2020)
ప్రొ. టీ కిషోర్‌కుమార్ (2021)
ప్రొ. శిరీష్ హెచ్ సోనావానే(2022)

**2. ఉత్తమ ఫ్యాకల్టీ అవార్డు (సైన్సెస్)**
ప్రొ. కే లక్ష్మీరెడ్డి (2020)
ప్రొ. పీ అబ్దుల్ అజీమ్ (2021)

**3. ఉత్తమ పరిశోధకుడి అవార్డు (ఇంజనీరింగ్)**
ప్రొ. వీ వాసు (2020)
ప్రొ. జీ నాగ శ్రీనివాసులు (2021)
ప్రొఫెసర్ వీవీ మణి (2022)
ప్రొ. శిరీష్ హెచ్ సోనావానే (2023)

**4. ఉత్తమ పరిశోధకుడి అవార్డు (సైన్సెస్)**
ప్రొ. కేవీ గోబీ (2020)
ప్రొ. పీవీ శ్రీలక్ష్మి (2022)
ప్రొ. పీ అబ్దుల్ అజీమ్ (2023)

**5. యువ పరిశోధకుడు (ఇంజినీరింగ్)**
ప్రొఫెసర్ కేవీఆర్ రవిశంకర్ (2020)
ప్రొ. సయ్యద్ ఇస్మాయిల్ (2021)
ప్రొ. టీ వినయ్ కుమార్ (2022)
ప్రొ. జీ రాఘవేంద్ర (2023)

**6.యువ పరిశోధకుడు (సైన్సెస్)**
ప్రొ. కే హరి ప్రసాద్ (2020)
ప్రొఫెసర్ వీ జయలక్ష్మి (2021)
ప్రొ. ఎస్ నాగరాజన్ (2023)

### అవార్డుల ప్రదానం

పూర్వవిద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బందికి అవార్డుల ప్రదానం చేశారు. 2023-విశిష్ట పూర్వవిద్యార్థుల అవార్డులను ఐదు విభాగాల్లో అందించారు. బోధన, పరిశోధనలకు సహకరించిన అధ్యాపకులు సైతం నాలుగేళ్లుగా పరిశోధన, బోధన విభాగాల్లో అవార్డులు పొందారు. కొవిడ్ కారణంగా మూడేళ్లపాటు అవార్డు ప్రదాన కార్యక్రమాన్ని నిర్వహించలేదు.



వేడుకలను ప్రారంభిస్తున్న కోమల్‌కపూర్, నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుధి

1. ప్రొఫెషనల్ ఎక్సలెన్స్-అకడమిక్ అండ్ రీసెర్చ్ డాక్టర్ కౌశిక్ కుమార్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెకానికల్ ఇంజినీరింగ్, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మెస్రా, రాంచీ, జార్ఖండ్, బీటెక్ (మెక్)-1990.

2. ప్రొఫెషనల్ ఎక్సలెన్స్-ఇండస్ట్రీ/కార్పొరేట్ డాక్టర్ శ్రీనివాస్ మంత్రాల హెడ్, ఫిక్స్‌డ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, నకాల లాజిస్టిక్స్ కారిడార్, వల్కాన్ ఇంటర్నేషనల్, మొజాంబిక్ బీటెక్ (సివిల్) - 1986.

3. ప్రొఫెషనల్ ఎక్సలెన్స్-పరిశ్రమ/కార్పొరేట్ వీఎన్ఆర్ నాయుడు, చీఫ్ జనరల్ మేనేజర్, భారత ప్రభుత్వ మింట్ హైదరాబాద్, బీటెక్ (ఎంఈటీ) - 1993.

4. పబ్లిక్ సర్వీస్-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ముత్యాల రాజు రేవు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, బీటెక్(ఈఈఈ) - 2002

5. పబ్లిక్ సర్వీస్-సోషల్ , కమ్యూనిటీ సర్వీస్ రాజా శ్రీనివాసరావు అయిత లీడ్ ప్రాజెక్ట్ లైట్-అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ, అబుదాబి (ఏడీఎన్‌వోసీ ఆఫ్ షోర్) బీటెక్ (సివిల్) -1994.



అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకున్న హనుమకొండ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం


### స్టూడియో బాగా నడుస్తోంది



జయశంకర్ భూపాలపల్లి. అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ) : నేను 20 ఏళ్లుగా భూపాలపల్లిలోనే ఉంటూ ఫొటో స్టూడియో నడిపిస్తున్నా. కేవలం సింగరేణి ప్రాంతం కావడంతో కొంతవరకు షాపు మంచిగానే నడిచేది. అప్పట్లో జనం ఎక్కువగా ఉండేవారు కాదు. భూపాలపల్లి జిల్లాగా మారిన తర్వాత భూపాలపల్లి టౌన్ ఊహించని విధంగా విస్తరించింది. రకరకాల షాపులు పెరిగాయి. జనాభా కూడా చాలా పెరిగింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఇక్కడే ఏర్పాటయ్యాయి. దీని వల్ల మా ఫొటో స్టూడియో వ్యాపారం కూడా ఊపందుకుంది. ప్రతి రోజు ఏదో ఒక కార్యక్రమం జరుగుతుంది. ఫంక్షన్లు, ఈవెంట్లు, ప్రభుత్వ కార్యక్రమాల ప్రోగ్రాంలతో చేతినిండా పని ఉంటోంది. కొత్త జిల్లా ఏర్పడకపోతే నాలాంటి వాళ్లకు పని ఉండకపోయేది.

– కోరె సదానందం, ఫొటో స్టూడియో, భూపాలపల్లి

# చేరువైన పాలన ప్రగతి పథాన



## చిన్న జిల్లాల ఏర్పాటుతో విప్లవాత్మక మార్పులు

- అనతికాలంలోనే అద్భుతంగా అభివృద్ధి
- తగ్గిన దూరభారం, సమస్యలకు పరిష్కారం
- అన్ని ప్రాంతాలపై నిత్యం పర్యవేక్షణ
- ప్రజలకు దగ్గరవుతున్న అధికారులు
- పల్లె, పట్టణాల్లో సకల సౌకర్యాలు
- సత్ఫలిస్తున్న కేసీఆర్ సర్కారు నిర్ణయం
- నేడు 8వ వసంతంలోకి కొత్త జిల్లాలు

*జిల్లాల పునర్విభజనతో పాలన ప్రజలకు చేరువైంది. 2016 అక్టోబర్ 11న కొత్త జిల్లాలు ఉనికిలోకి రాగా, ఏడేళ్లలో ఉమ్మడి వరంగల్ జిల్లా అద్భుత ప్రగతి సాధించింది. అనతి కాలంలోని ఆరు జిల్లాల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. దూరభారం తగ్గడంతో సమస్యలు వెనువెంటనే పరిష్కారానికి నోచుకుంటున్నాయి. గతంతో పోల్చితే కొత్త జిల్లాల విస్తీర్ణం తక్కువగా ఉండడం వల్ల అధికారయంత్రాంగానికి గ్రామాలు, మండలాలు చుట్టి రావడమే గాక ప్రభుత్వ పథకాల అమలుపై పర్యవేక్షణ సులభమైంది. అంతేగాక చిన్న జిల్లా ఏర్పడిన తర్వాత జిల్లాకేంద్రం సహా చుట్టూ ఉన్న ప్రాంతాల్లో ఊహించని విధంగా మార్పులు వచ్చాయి. అన్ని కార్యాలయాలు ఏర్పడడం, కొత్త కొత్త దుకాణాలు, వ్యాపారాలు పెరుగడం వల్ల ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధించే వీలు కలిగింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాల్లో అత్యాధునిక సమీకృత కలెక్టరేట్లు నిర్మించడంతో పాటు వేలాది కోట్లతో నగరాలు, పట్టణాలను తీర్చిదిద్దుతున్నది. అదేస్థాయిలో ప్రతి పల్లెకూ సకల సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తుండడంతో పాటు విద్య, వైద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నది. కేసీఆర్ సర్కారు ప్రోత్సాహం, కొంగొత్త ఆలోచనలతో చిన్న జిల్లాలు ప్రగతిపథంలో దూసుకుపోతూ నేడు ఎనిమిదో వసంతంలోకి అడుగుపెడుతున్నాయి.*

*– నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 10*



### అధికారుల పర్యవేక్షణ పెరిగింది..

వర్ధన్నపేట, అక్టోబర్ 10 : చిన్న జిల్లాల ఏర్పాటుతో నిత్యం ఉన్నతాధికారులు అందుబాటులో ఉంటున్నారు. ప్రజలు వారి సమస్యలను త్వరితగతిన అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించుకుంటున్నారు. మండల కేంద్రాలు, గ్రామాలను సందర్శించి అభివృద్ధి, సంక్షేమ పథకాలపై పర్యవేక్షణ సులభమైంది. రాష్ట్ర ప్రభుత్వం వర్ధన్నపేటను మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేసింది. సీఎం కేసీఆర్ చిన్న జిల్లాను ఏర్పాటు చేయడం వల్లే ఇది సాధ్యమైంది. దూరదృష్టితో ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయం వల్ల అన్ని ప్రాంతాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి.

– హన్మకొండ సుధాకర్, విశ్రాంత ఉద్యోగి

### ప్రజా పరిపాలన వ్యవస్థ బలోపేతం అయింది



ములుగు, అక్టోబర్ 10(నమస్తే తెలంగాణ) : తెలంగాణ ప్రాంతంపై సీఎం కేసీఆర్‌కు పూర్తి అవగాహన ఉంది. దూరదృష్టితో చిన్న జిల్లాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుతున్నాయి. జిల్లాకేంద్రంతో పాటు మండలకేంద్రాల్లో భూముల విలువలు పెరిగి ప్రజల ఆర్థిక స్థితిగతుల్లో అనేక మార్పులు వచ్చాయి. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో పాటు జిల్లాస్థాయి అధికారులు ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారు. గతంలో ప్రజలు పనుల కోసం కలెక్టరేట్‌కు వెళ్లాలంటే 200 నుంచి 250 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వచ్చేది. ఇప్పుడు అది 60 నుంచి 70 కి.మీ.కు తగ్గడం వల్ల రవాణాతో పాటు ఆర్థిక ఇబ్బందులు తప్పాయి

– పింగిలి నాగరాజు, సామాజికవేత్త, ములుగు



ఇటీవల అందుబాటులోకి వచ్చిన మహబూబాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాల

### చిన్న జిల్లాలతో సత్వర సేవలు



పాలకుర్తి, అక్టోబర్ 10 : తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ముందుచూపుతో కొత్త జిల్లాలు ఏర్పాటుచేయడం వల్ల ప్రజలకు సేవలు వేగంగా అందుతున్నాయి. పాలన చేరువకావడంతో అభివృద్ధి కూడా అదేస్థాయిలో జరుగుతోంది. అలాగే జిల్లా అవసరాలకు తగ్గట్టుగా అన్ని కార్యాలయాలు ఒకేచోట ఉండేలా సమీకృత కలెక్టరేట్ అందుబాటులోకి వచ్చింది. అక్కడ అన్ని శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉన్నందున ప్రజలకు సులభతరంగా మారింది. సమైక్యపాలనలో ప్రజలకు కనీస సదుపాయాలు లేక చాలా ఇబ్బందులు పడ్డారు. కానీ స్వరాష్ట్రంలో మండలాలు, గ్రామాలు, గిరిజన తండాల్లోనూ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.

– కొండ వెంకటయ్య, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు పాలకుర్తి



### జిల్లా అభివృద్ధిలో పరుగులు

జనగామ చౌరస్తా, అక్టోబర్ 10 : జనగామ జిల్లా ఆవిర్భావంతో సమీకృత కలెక్టరేట్ వచ్చింది. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండడంతో ప్రజలకు మెరుగైన సేవలందిస్తున్నాయి. జిల్లాలో ఉద్యోగుల సంఖ్య పెరిగింది, పని ఒత్తిడి తగ్గింది. కార్యాలయాల్లో పెండింగ్ ఫైల్స్ అనే ముచ్చటే లేదు. అధికారులు పూర్తి పారదర్శకంగా ప్రజలకు సేవలందిస్తున్నారు. జిల్లాకు మెడికల్ కళాశాల రావడం ఈ ప్రాంత విద్యార్థులు, ప్రజల అదృష్టం. జిల్లాను మరింత అభివృద్ధిపథంలో తీసుకెళ్లడానికి, ప్రజలకు మెరుగైన పరిపాలన సేవలు అందించడానికి ఉద్యోగులు నిరంతరం కృషి చేస్తున్నారు. అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో జిల్లా పరుగులు పెడుతోంది.

– ఖాజా షరీఫ్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు, జనగామ

### ప్రజలకు పాలన చేరువైంది



ఖానాపురం, అక్టోబర్ 10 : కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలన ప్రజలకు చేరువైంది. ఉమ్మడి జిల్లా ఉన్నప్పుడు మండలాలు, గ్రామాలకు కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులు చాలా అరుదుగా వచ్చేవారు. సమస్యలు పరిష్కారం కావడానికి చాలా సమయం పట్టేది. కానీ కొత్త జిల్లాల ఏర్పాటు కావడం వల్ల జిల్లాలోని అన్ని గ్రామాలపై అధికారుల పర్యవేక్షణ పెరిగింది. ప్రభుత్వ పథకాల అమలుపై నిశితంగా పరిశీలిస్తున్నారు. దీని వల్ల ప్రతి లబ్ధిదారుకు సకాలంలో ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. అంతేగాక సమస్యల గుర్తింపు, పరిష్కారం త్వరితగతిన అవుతున్నది. కొత్త జిల్లాలతో ప్రజలు ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయి. సీఎం కేసీఆర్ ముందుచూపుతో తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్రాభివృద్ధికి బాటలు వేస్తున్నది.

– అన్నం ప్రసాదరావు, రిటైర్డ్ కండక్టర్, ఖానాపురం



### మెరుగైన సేవలు అందించగలుగుతున్నాం

రాయపర్తి, అక్టోబర్ 10 : రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలను అందించగలుగుతున్నాం. గతంలో సుమారు 50-70 మండలాలతో ఒక్క జిల్లా ఉండడం, ఒక జిల్లాకు ఒకే కలెక్టర్, ఒకే జాయింట్ కలెక్టర్ విధులు నిర్వర్తించేవారు. కలెక్టర్, జేసీలను కలిసేందుకు మండల స్థాయి అధికారులకే సాధ్యమయ్యేది కాదు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. 14-16 మండలాలతోనే జిల్లాలు ఏర్పాటుచేయడం, కొత్త రెవెన్యూ డివిజన్ల ఏర్పాటుతో ప్రభుత్వ అధికారులు నిత్యం ప్రజల ముంగిట కన్పిస్తున్నారు. ప్రభుత్వ అధికార యంత్రాంగానికి పరిపాలనతోపాటు సంక్షేమ కార్యక్రమాలు అమలు పర్యవేక్షణ సైతం సులభమవుతున్నది. ప్రభుత్వం తీసుకున్న కొత్త జిల్లాల ఏర్పాటు నిర్ణయం అన్ని వర్గాలకు మేలు చేస్తున్నది.

– ధరావత్ సూర్యానాయక్, నాయబ్ తహసీల్దార్, రాయపర్తి